సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023

బోనమో పోచమ్మ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం వేకువజాము నుంచే బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరారు. బద్దిపోచమ్మ వీధి రద్దీగా మారింది. గంటల తరబడి క్యూలైన్లలో వేచిచూసిన భక్తులు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డారు.



న్యూస్‌రీల్

అడిషనల్ కలెక్టర్‌గా గౌతంరెడ్డి

- కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు

సిరిసిల్లటౌన్: జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా(స్థానిక సంస్థలు) జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా పనిచేసిన బి.సత్యప్రసాద్ ఖమ్మంకు బదిలీకావడంతో ఆయన స్థానంలో గౌతంరెడ్డికి పూర్తి బాధ్యతలు అప్పగించారు.

ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి



సిరిసిల్లఅర్బన్: రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ డీలర్ల వద్ద ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-కేవైసీ అమలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి



సిరిసిల్లటౌన్/ఇల్లంతకుంట(మానకొండూర్): ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు కోరారు. ఇల్లంతకుంట పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ ఆరోగ్య మహిళ కార్యక్రమంలో రక్త, మూత్రపరీక్షలు, కేన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మపోషక లోపాలు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్స్, పీసీవోస్, కుటుంబ నియంత్రణ తదితర 8 రకాల సేవలు అందుతాయని తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు వివరించారు. ఓపీడీ(479), బ్రెస్ట్(479), ఓరల్ కావిటీ(479) పరీక్షలు చేసినట్లు తెలిపారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ఎనిమిది మందిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీరాములు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, వైద్యాధికారులు శరణ్య, రమేశ్ ఉన్నారు.

16న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ లెక్కింపును ఈనెల 16న స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో చేపడుతున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

16న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఖేలో ఇండియాలో భాగంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. 14 ఏళ్లు నిండిన బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మినీస్టేడియంలో నిర్వహించే పోటీలకు హాజరుకావాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి



వేములవాడరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని.. వాటిని సాధించేందుకు కృషి చేయాలని కవి, రచయిత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏక్యూఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు ఫస్టియర్ నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా నిత్యం కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, ఏక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ మధు రాజేశ్, ఎన్ఎస్ఎస్ అధికారి రమాదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎములాడలో ట్రాఫిక్ జామ్

- రాజన్న ఆలయానికి తరలివస్తున్న భక్తులు
- మూలవాగు వంతెన పూర్తికాని వైనం
- రోడ్లపైనే నిలుస్తున్న వాహనాలు
- రోడ్ల విస్తరణకు నోచుకునేదెప్పుడో?

ఇరుకురోడ్లతోనే ఇక్కట్లు



తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద భారీగా వాహనాల రద్దీ

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడలో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. రాజన్నకు ప్రీతికరమైన సోమవారం, ప్రత్యేక సందర్భాల్లో భక్తులు అధికంగా వస్తే వేములవాడలో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోతుంటాయి. గంటలకొద్దీ రోడ్లపైనే వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇరుకురోడ్లు ఉండడమే ప్రధాన సమస్యగా మారింది.

తిప్పాపూర్ నుంచి మొదలు

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని తెలంగాణచౌక్ వద్ద కరీంనగర్ – సిరిసిల్ల – ఆర్టీసీ బస్టాండ్ – రాజన్న గుడి నాలుగు దారులు కలుస్తుంటాయి. చౌరస్తా కావడంతో ఇక్కడ వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. సాధారణ రోజుల్లోనే ఎక్కడి నుంచి వాహనాలు ఎటు వైపు వెళ్తాయో తెలియదు. అదే ప్రత్యేకమైన సోమవారం, శ్రావణమాసంలో పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. తెలంగాణచౌక్‌ను విస్తరిస్తేనే వాహనాల రద్దీ సమస్య పరిష్కారమవుతుంది.

అత్యంత రద్దీ రహదారి

రాజన్న దర్శనానికి అత్యధికంగా భక్తులు వచ్చే వరంగల్ మార్గం తెలంగాణచౌక్ నుంచే వెళ్తుండడంతో ఇక్కడ వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అంతేకాకుండా రోడ్లు ఇరుకుగా ఉండడం ప్రధాన సమస్యగా మారింది. కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు సైతం వేములవాడలోకి మూలవాగు వంతెన నుంచి ప్రవేశిస్తుంటాయి. రెండో వంతెన పూర్తికాకపోవడం కూడా మరో సమస్యగా మారింది.

మూలవాగు వంతెనకు మోక్షం ఎప్పుడో?

వేములవాడ మూలవాగు పాత బ్రిడ్జికి ఇరువైపులా రెండు కొత్త వంతెనల నిర్మాణంతోపాటు తెలంగాణచౌక్, అమరవీరుల స్తూపం కూడలి ఏర్పాటు సుందరీకరణకు 2015లో పనులు ప్రారంభించారు. దీంతో పాత వంతెన పై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. మరో వైపు ఉన్న బ్రిడ్జి పనులు ఏళ్లుగా సా..గుతున్నాయి. రెండో వంతెన పనులు పూర్తయితే తెలంగాణచౌక్ వద్ద, అమరవీరుల స్తూపం వద్ద రోడ్డు విస్తరణ పనులు అయితే వాహనాల రద్దీ తగ్గే అవకాశాలు ఉన్నాయి.

విస్తరణకు నోచుకోని రహదారులు

మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు గల ప్రధాన రోడ్డును విస్తరించాలని గతంలోనే నిర్ణయించారు. ఇప్పటికే సర్వేలు సైతం పూర్తి చేశారు. కానీ పనులు చేపట్టడడంతో ఏళ్లకేళ్లుగా నిర్లక్ష్యం పేరుకుపోయింది. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యానికి ఈ మార్గంలో వాహనాలు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. భక్తుల రాకపోకలతో ఈ రోడ్డు బిజీగా మారుతుంది.

- రాజన్న ప్రధాన ఆలయం నుంచి భీమన్న గుడి, బద్దిపోచమ్మ ఆలయాలకు వెళ్లే రహదారులు రోజురోజుకు కుంచించుకుపోతున్నాయి. వీటి విస్తరణ చేపట్టడం లేదు. ఫలితంగా వాహనాలు కదలడం లేదు.
- రాజన్న ఆలయం వెనుకభాగంలోని పార్కింగ్ స్థలానికి వెళ్లే రోడ్డు సైతం ఇరుకుగా మారింది.
- రాజన్న ఆలయం నుంచి జగిత్యాల బస్టాండ్‌కు వెళ్లే మార్గం సైతం ఇరుకుగా మారడంతో కిలోమీటర్ దూరం ప్రయాణించాలంటే కనీసం అరగంట పడుతుంది.
- ఇక వేములవాడలోని అంతర్గత రహదారులు మరీ దారుణంగా ఉన్నాయి. అంతర్గతకాలనీల్లో ఒక్క కారు వెళ్తే ఎదురుగా మరో కారు వెళ్లే పరిస్థితి లేదు.
- పట్టణంలోని సుభాష్‌నగర్ మీదుగా భీమన్న గుడికి వెళ్లే దారి మరీ ఇరుకుగా మారింది. మూలమలుపులు ఎక్కువగా ఉండడం తోపాటు మరీ ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వాహనం వస్తే రివర్స్‌లో వెళ్లాల్సిందే.
- రాజన్న గుడి నుంచి నందీశ్వరకాంప్లెక్స్ వరకు గల రోడ్డు మూడు గజాల వెడల్పే ఉండడంతో భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



వేములవాడ: పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయం వద్ద గల రోడ్డు ఇరుకుగా ఉండడంతో భక్తుల రద్దీ ఉండే ఆది, సోమ, మంగళవారాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల ఏర్పడుతున్నాయి. జనం నడించేందుకు సైతం వీలు లేకుండా పరిస్థితులు ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అక్కడే విధుల్లో ఉంటూ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. వేములవాడలోని రోడ్లను విస్తరిస్తేనే స్థానికులు, భక్తుల ట్రాఫిక్ కష్టాలు తీరేలా కనిపిస్తున్నాయి.

ఎప్పుడూ ఇదే పరిస్థితి



తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద మూడు రోడ్లు కలువగా, బస్టాండ్‌లోకి ప్రవేశం కూడా ఇక్కడే ఉంది. దీంతో రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలతో ఇక్కడ రద్దీగా మారుతుంది. ప్రతి ఆది, సోమవారం రోజుల్లో వాహనల రద్దీ ఎక్కువగా ఉంటుంది.
– చిలివేరి శ్రీనివాస్, నాంపల్లి

బ్రిడ్జి నిర్మించాలి



వేములవాడ మూలవాగుపై రెండు బ్రిడ్జీలు ప్రారంభించినప్పటికీ ఒక్కటి మాత్రమే పూర్తయింది. మరో బ్రిడ్జి నేటికి కూడా పూర్తికాలేదు. బ్రిడ్జి పనులు పూర్తి చేసి, రెండు జంక్షన్లు ఏర్పాటుచేస్తే ఎటు వెళ్లాల్సిన వాహనలు అటుగా వెళ్తాయి. ప్రయాణికులకు ఇబ్బంది ఉండదు.
– బుర్ర శేఖర్, సంకెపల్లి

పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశాం



శ్రావణమాసం కావడంతో రాజన్న దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వాహనాలలో వస్తున్నారు. తిప్పాపూర్ బస్టాండ్ వద్ద, బ్రిడ్జి వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశాం. నాంపల్లి వద్ద కూడా సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనల రద్దీని బట్టి వన్ వే కోసం నందికమాన్ మీదుగా వాహనాలను మళ్లిస్తున్నాం.
– కరుణాకర్, వేములవాడ టౌన్ సీఐ

ట్రాన్స్‌జెండర్స్ ఓటుహక్కు వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, దీనిలో భాగంగా ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్స్‌తో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేయించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఏసీడీపీవో సుచరిత, సఖీ కోఆర్డినేటర్ పద్మ, డిస్ట్రిక్ట్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ రోజా, పోషణ్ అభియాన్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

టెట్ కోసం 15 కేంద్రాలు

సిరిసిల్లఅర్బన్: ఈనెల 15న నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు జిల్లా కేంద్రంలో 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ అంబేడ్కర్‌నగర్ పాఠశాల, శ్రీచైతన్య, విజ్ఞాన్ హైస్కూల్, సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం, శ్రీకృష్ణవేణి టాలెంట్, ఇంగ్లిష్ యూనియన్ స్కూల్, గీతానగర్ జెడ్పీహెచ్ఎస్ బాలికలు, శివనగర్ జెడ్పీ బాలుర స్కూల్, జెడ్పీహెచ్ఎస్ వెంకంపేట, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, శ్రీకృష్ణదేవరాయ, సాయిశ్రీ, సహస్ర జూనియర్ కాలేజీ, వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల, మహతీ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో టెట్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

బస్టాండ్‌లో రద్దీ.. బస్సుల కోసం కుస్తీ



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు మంగళవారం స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు. తిప్పాపూర్‌లోని ప్రధాన బస్టాండుకు వేలాది సంఖ్యలో భక్తులు చేరుకోగా.. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేవు. బస్సుల కోసం భక్తులు ప్రధాన రోడ్డుపై వరకు పరుగులు తీశారు. బస్సులోకి ఎక్కేందుకు ఎగబడ్డారు.

డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి కల్పించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్) టైడ్స్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలని కలెక్టర్, టైడ్స్ సొసైటీ చైర్మన్ అనురాగ్ జయంతి కోరారు. మండెపల్లి ఐటీడీఆర్‌లో మంగళవారం ఆరో వార్షిక సాధారణ సమావేశం సొసైటీ సభ్యులతో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో టైడ్స్ ఏర్పాటైందన్నారు. డ్రైవింగ్‌లో అంతర్జాతీయస్థాయి శిక్షణనిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. టైడ్స్ ఆదాయం పెరిగేలా ప్రాయోజిత శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ, స్కూల్‌బస్సు డ్రైవర్లకు అవగాహన, మెళకువలు నేర్పాలన్నారు. విద్యార్థులకు డ్రైవింగ్ ప్రాధాన్యత వివరించాలన్నారు. టైడ్స్ కార్యదర్శి రాఘవన్, కోశాధికారి అనురాగ్ కనున్గో, లీగల్ మెంబర్ సతీశ్, సభ్యులు అమిత్ జైన్, మీనా, బస్వరాజు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

అవెన్యూ ప్లాంటేషన్ పనులు పూర్తిచేయండి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శివారులోని రెండో బైపాస్ రోడ్డులో చేపడుతన్న అవెన్యూ ప్లాంటేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ప్లాంటేషన్‌ను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. రగుడు జంక్షన్ నుంచి వైద్యకళాశాల వరకు మున్సిపల్, అక్కడి నుంచి వెంకటాపూర్ కూడలి వరకు పంచాయతీరాజ్ అధికారులు చూసుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీ సమీపంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వెనుకాల 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అభివృద్ధి చేస్తున్న మోడల్ లే అవుట్ పనులను పరిశీలించారు. వేములవాడ గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్లు ఆయాజ్, అన్వేశ్, వీటీడీఏ సెక్రటరీ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ అన్సార్, టూరిజం డీఈఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక అప్పులు !

- ఆరు నెలలుగా ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో 'మధ్యాహ్నం' కార్మికులు నేటి నుంచి సమ్మెబాట

మధ్యాహ్న భోజనం అమలు ఇలా..

పాఠశాలలు	478
విద్యార్థులు	41,328
ఏజెన్సీలు	478
కార్మికులు	1400

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పౌష్టికాహారం లోప నివారణతోపాటు విద్యార్థులు డ్రాపౌట్ కావొద్దని ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మధ్యాహ్న వంట తయారు చేసే కార్మికులకు మాత్రం నెలల కొద్ది బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఫలితంగా అప్పులపాలవుతున్నారు. ఏడాదిగా వారికి పెరిగిన గౌరవ వేతనం అందడం లేదు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నుంచి సమ్మెబాట పడుతున్నారు.

జిల్లాలో 1,400 మంది కార్మికులు

జిల్లాలో 1,400 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.వెయ్యి గౌరవ వేతనం అందిస్తున్నారు. వారికి ఇస్తున్న రూ.వెయ్యితోపాటు మరో రూ.2 వేలు ఇస్తామని ప్రభుత్వం గతేడాది ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు వారికి అందడం లేదు.

కార్మికుల డిమాండ్లు ఇవీ..

- ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలి.
- గతేడాది సీఎం కేసీఆర్ కార్మికులకు రూ.3 వేల గౌరవ వేతనం అందిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ అమలు కావడం లేదు.
- కిచెన్‌షెడ్లు నిర్మించి, నీటి వసతి కల్పించాలి.
- కోడిగుడ్లకు మార్కెట్ ధర ప్రకారం బడ్జెట్ కేటాయించాలి.
- గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం సరఫరా చేయాలి.
- భోజన కార్మికులకు ప్రమాదబీమా సదుపాయం కల్పించాలి.



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

పెంచిన వేతనాలు ఇవ్వాలి



మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్న కార్మికులకు కొన్నేళ్లుగా వేతనం రూ.3వేలకు పెంచుతున్నట్లు సీఎం సారు చెప్పారు. కానీ ఏడాది గడుస్తున్నా పెంచిన వేతనాలు రావడం లేదు. ఇప్పటికైనా పెంచిన వేతనాలు అందివ్వాలి.
– జంగం దేవవ్వ, బావుసాయిపేట

నేటి నుంచి సమ్మెబాట



మధ్యాహ్న భోజన కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి, కోడిగుడ్లు సరఫరా చేయాలి. బుధవారం నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నారు.
– ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

సమస్యల పరిష్కారం కోసమే ఠాణాదివస్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఠాణాదివస్

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రజాసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఠాణాదివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 50 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ వెళ్లడానికి, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి నెల మొదటి వారంలో ఒక పోలీస్‌స్టేషన్‌లో ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు కమ్యూనిటీ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భూతగాదాలలో క్రిమినల్ సమస్య ఉంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

గ్రామ పోలీసు వ్యవస్థను పటిష్ట పరచాలి

సిరిసిల్లక్రైం: శాంతిభద్రత పరిరక్షణకు గ్రామస్థాయిలో గ్రామ పోలీస్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిరిసిల్లరూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసుల వివరాలు, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైల్స్, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరస్తులకు శిక్షల శాతం పెరిగితే పోలీసులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

సుపరిపాలనే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజినీర్ శాఖలో నూతన విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేస్తే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రంలో సిరిసిల్ల జిల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ధరణితో రాష్ట్రంలోని భూసమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీలు చంద్రయ్యగౌడ్, మానస రాజు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ అధికారి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

వెల్లువెత్తిన నిరసనలు



బైక్ ర్యాలీ తీస్తున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గిరిజన రైతులు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను భగ్నం చేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన హెచ్చరించారు. తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు ఉద్యోగులు మంగళవారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ఎదుట మహాధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. అధికారులు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొడుతూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజిత్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు కల్వకుంట్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

తమ ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ ఖయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ తదితరులున్నారు.

గిరిజన రైతులకు పట్టా బుక్కులివ్వాలి

గిరిజన రైతులకు వెంటనే పట్టా బుక్కులివ్వాలని లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట గిరిజన రైతులు బైఠాయించగా వారికి మద్దతు తెలిపారు. మానాల శివారు వీరునితండా పరిధిలోని పట్టా భూములకు సర్వే చేయించి, రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పట్టాబుక్కులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనుగుల, నేరెళ్ల భూములకు ఒకే సర్వే నంబరు ఇవ్వడంతో ధరణిలో నమోదు చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ మోహన్‌నాయక్, ఉపసర్పంచ్ నరహరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బలగం సినిమా సర్పంచ్‌కు నివాళి



సిరిసిల్లకల్చరల్: జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద బలగం సినిమా సర్పంచ్ కీసరి నర్సింగం మృతిపై మంగళవారం నివాళి అర్పించారు. నర్సింగం చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, జూకంటి జగన్నాథం, వెంగళ నాగరాజు, వెంకటరెడ్డి, ఎర్ర దేవరాజు, ఉస్మాన్, రవి తదితరలు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

ముస్తాబాద్(సిరిసిల్ల): కొయంబత్తూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రజాప్రతినిధులు మంగళవారం అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వాలీబాల్ పోటీల్లో బాలికల జట్టు సత్తా చాటిందని తెలిపారు. జాతీయ స్థాయిలో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్ నగదు అందించారు. సర్పంచ్ పాశం సరోజన, తదితరులు అభినందించారు.

కేజీబీవీ తనిఖీ

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేజీబీవీని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట నాణ్యత లేకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని, సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీసీడీవో పద్మజ, ఎస్‌వో నీలిమ, సర్పంచ్ దినకర్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎస్ఎంసీ చైర్మన్ గుగులోత్ కళ, వీర్నపల్లి ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

కోరెంలో చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం గ్రామానికి చెందిన సంబు అంజమ్మ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. అంజమ్మ కుమారుడు సాగర్ వేములవాడలో జీవనోపాధి కోసం ఉంటున్నాడు. తల్లి అంజమ్మ ఒక్కతే కోరెంలో ఉంటుంది. సోమవారం ఉదయం అంజమ్మ కుమారుడు సాగర్ వద్దకు వేములవాడకు వెళ్లింది. సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉంది. ఐదు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారని అంజమ్మ కుమారుడు సాగర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ వివరించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

చందుర్తి/వేములవాడ: మల్యాల, నర్సింగపూర్, చందుర్తి గ్రామాలకు చెందిన 9 మంది డీజే నిర్వాహకులను డిప్యూటీ తహసీల్దార్ లీలారాణి ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన 22 మంది డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11 కోట్లు మోసం

- ఐదు నెలలుగా అజ్ఞాతంలో నిందితులు
- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- సీపీ రెమా రాజేశ్వరి వెల్లడి



అరెస్టు చూపిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11 కోట్లు మోసం చేసి.. ఐదు నెలలుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడు చెవ్వా రవిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీపీ రెమా రాజేశ్వరి నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రవి కమిషనరేట్ పరిధిలో సుమారు 50మందిని మోసం చేశాడు. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తానని ఆశ చూపేవాడన్నారు. డబ్బులు ఇస్తే లాభాలు రోజువారీగా, వారం, నెలవారీగా అధిక మొత్తంలో ఇస్తానని చెప్పి జిల్లాకు చెందిన 50 మంది నుంచి సుమారు రూ.2.11కోట్లు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి నేతృత్వంలో సీఐ సుధాకర్, ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే మరింత మందిని మోసం చేసేందుకు హైదరాబాద్ నుంచి మంచిర్యాల వస్తున్నాడనే సమాచారం మేరకు తనీఖీలు చేస్తుండగా.. మంచిర్యాల రైల్వేబ్రిడ్జి ప్రాంతంలో రవి అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడిని అరెస్టు చేసి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్కులు, చెక్‌బుక్కులు, రూ.8వేల నగదు, రిజిస్టర్ బుక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీఐ సుధాకర్, అశోక్, ఎస్సైలు ప్రసాద్, లచ్చన్న సిబ్బంది ఉన్నారు.

అదనపు కలెక్టర్ సేవలు అభినందనీయం

- వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి



సన్మానిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: జిల్లా అభివృద్ధికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బి.సత్యప్రసాద్ సేవలు అభినందనీయమని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ఆయన ఖమ్మంకు బదిలీ కావడంతో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు మొదటి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా సత్యప్రసాద్ మూడేళ్లపాటు అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో ఒకరు వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండల కేంద్రం శివారులోని మొర్రాయిపల్లె మార్గంలో ఓ వ్యవసాయబావిలో మంగళవారం శవం తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు బావి వద్దకు వెళ్లి బయటకు తీశారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని, ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. శవాన్ని పీసీ రాజశేఖర్, స్థానిక యువకులు, పంచాయతీ కార్మికుల సాయంతో బయటకు తీశారు. ఎవరైన చంపి బావిలో పడేశారా? ఆత్మహత్య చేసుకుని ఉంటాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖం కుళ్లిపోవడంతో ఇటీవల నమోదైన మిస్సింగ్ కేసులపై ఆరా తీస్తున్నారు.


విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సిరిసిల్లకల్చరల్: ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కాళోజీ జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాహితీ, శరణ్య, భవతి, ఐదుగురు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ పాల్గొన్నారు.

బద్దం ఎల్లారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం నాయకులు మంగళవారం గాలిపల్లిలోని బద్దం ఎల్లారెడ్డి స్తూపం వద్ద నివాళి అర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ.. సిరిసిల్ల బీవై నగర్‌లో బద్దం ఎల్లారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నిజాం హయాంలో దొరలు ఏ విధంగా ప్రజలను అణిచివేయాలని చూశారో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందన్నారు. పేదల ప్రజలు కూడు, గూడు కోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని తెలపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, రాజు, మంద అనిల్, ఆదిత్య, రాకేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

15న సీపీఐ బహిరంగ సభకు రండి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇందిరమ్మకాలనీలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. సాయుధ పోరాటంలో అమరులైన వేలాది మందిని స్మరించుకుంటూ ఈ నెల 11 నుంచి 17 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న కామ్రేడ్ సింగిరెడ్డి భూపతి రెడ్డి స్తూపం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు మంచికట్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు, నాయకులు సదానందం, బాలచంద్రం, రాజేందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలో మంగళవారం ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాల డిపోకు చెందిన రెంక రవి, జనరల్ సెక్రటరీగా వరంగల్ డిపోకు చెందిన వంగ రాజు, కోశాధికారిగా సిరిసిల్ల డిపోకు చెందిన రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదాడ డిపోకు చెందిన దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జిగా మహబూబాబాద్ డిపోకు చెందిన శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా యాదగిరిగుట్ట డిపోకు చెందిన బూడిద నరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బూడిద నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో యూనియన్‌ను ఎన్నుకున్నట్లు అద్దె బస్సు డ్రైవర్ల సంఘం సభ్యులు తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు.

రమేశ్‌కు పర్యావరణ పరిరక్షణ పురస్కారం



ముస్తాబాద్(సిరిసిల్ల): పర్యావరణ పరిరక్షణ లెజెండ్ జాతీయ పురస్కారానికి ఎల్లారెడ్డిపేటకు చెందిన దుంపెన రమేశ్ ఎంపికయ్యారు. రమేశ్ మాట్లాడుతూ పుష్కరకాలంగా స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని అవగాహన కల్పించడంతోపాటు మొక్కల అందజేస్తున్నట్లు తెలిపారు. సాహిత్యంలో పలు రచనలు చేశానన్నారు. ప్రకృతి ప్రేమికుడిగా.. తాను చేసిన సేవలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఈ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో అందజేయనున్నట్లు తెలిపారు. రమేశ్‌ను బాలసాహితీవేత్త డాక్టర్ వాసరవేణి పర్శరాములు, ప్రకృతి ప్రేమికులు అభినందించారు.

వెంకట్రావుపేటవాసికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న అనిల్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన కర్నాల అనిల్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లోని నాంపెల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో అర్పిత సాహిత్య, సాంఘిక స్వచ్ఛంద సేవా సంస్థ 22వ వార్షికోత్సవం నిర్వహించారు. స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ తెలంగాణ–2023(సామాజిక సేవ) అవార్డును కర్నాల అనిల్‌కుమార్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి అందజేశారు. వెంకట్రావుపేటకు చెందిన అనిల్ యువచైతన్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి సామాజిక సేవ అందిస్తున్నాడు.

'మధ్యాహ్న' కార్మికులకు రూ.18 వేలివ్వాలి

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికులను రాష్ట్ర సర్కారు మోసం చేసిందని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ వస్తే ఔట్‌సోర్సింగ్ అనేది ఉండదని చెప్పి, ఇప్పటివరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు మీస లక్ష్మన్ తదితరులున్నారు.

మీ ప్రాంత బిడ్డగా గెలిపించండి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- లింగంపేట, సంకెపల్లి గ్రామాల్లో సమావేశాలు



సంకెపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చందుర్తి (వేములవాడ) : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగుతున్నానని, మీ ప్రాంత బిడ్డగా తనను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. చందుర్తి మండలంలోని లింగంపేటకు చెందిన యువజన సంఘం నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్సార్ సహకారంతో ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకానికి 2005లో రూ.1,700 కోట్లతో మల్యాలలో భూమిపూజ చేయించానని, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి మండలాల్లో జూనియర్ కాలేజీలు మంజూరు చేయించానని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. నాయకులు బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం

వేములవాడరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ముంపు గ్రామాల బాధితుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని సంకెపల్లిలో పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. గడపగడపకూస్‌లో భాగంగా గ్రామస్తులతో మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ప్రతీ ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు, కూలీలకు రూ.12 వేలు, ఫించన్ రూ.4 వేలు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామన్నారు. ఆరెపల్లి నుంచి చీర్లవంచ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామన్నారు. అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, మారం రాజ్‌కుమార్, చింతపల్లి శ్రీనివాసరావు, పండుగ పర్శరాములు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- డీఎస్పీ నాగేంద్రచారి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్ల క్రైం: ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అన్ని పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించి, ఎన్నికల నియమావళిని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్నారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. నిజానిజాలు తెలియకుండా సోషల్ మీడియా ఏ విషయాన్నీ పోస్టు చేయొద్దని పేర్కొన్నారు. ఒకవేళ చేస్తే చేసేవారితోపాటు గ్రూప్ అడ్మిన్స్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వేములవాడరూరల్: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని తెట్టెకుంటలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల రక్షణకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పేపర్లు, నంబర్ ప్లేట్లు లేని 34 బైక్‌లను, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఇంటి యజమానే దొంగ

- జల్సాలకు అలవాటు పడ్డ యువకుడు
- అద్దెకు ఇచ్చిన ఇంట్లోనే దొంగతనం
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఏ పని చేయకుండా జల్సాలకు అలవాటుపడ్డ యువకుడు చోరీలకు పాల్పడి.. చివరికి కటకటాల పాలయ్యాడు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గనగోని బంటి ఎల్లారెడ్డిపేటలో ఫ్లెక్సీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 9న బంటి దుకాణానికి తాళం వేసి ఇంటికెళ్లాడు. 11న దుకాణం తీయగా.. తాళం పగులకొట్టి ఉండడాన్ని గమనించాడు. కౌంటర్‌లోని రూ.3,500 చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు. బంటి అద్దెకు ఉంటున్న ఇంటి యజమానికి రామిండ్ల సుధీర్ దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. సెంట్రింగ్ పనులు చేస్తున్న సుధీర్‌తో కుటుంబంలో కలహాలు వచ్చాయి. దీంతో మద్యానికి బానిసగా మారిన సదరు యువకుడు జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈక్రమంలోనే తాను అద్దెకు ఇచ్చిన దుకాణంలోనే చోరీ చేశాడు. సుధీర్‌ను రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కేసీఆర్‌నగర్(డబుల్ బెడ్ రూమ) సముదాయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. అంబటి శ్రీధర్(34) కేసీఆర్‌నగర్ సముదాయంలోని బ్లాక్ నంబర్ 54లో రూమ్‌నంబర్ ఒకటిలో తల్లి లక్ష్మితో కలిసి నివసిస్తున్నాడు. శ్రీధర్‌కు వివాహంకాలేదు. టెక్స్‌టైల్‌పార్క్‌లో పవర్‌లూమ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తల్లిని అక్క ఇంట్లో బండిపైన దింపి వచ్చిన శ్రీధర్ డబుల్ బెడ్‌రూమ్‌లోని ఇంటికొచ్చి తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో తండ్రి చంద్రశేఖర్ చనిపోయాడు. మృతుడికి తల్లి లక్ష్మి, అక్క ఆకాంక్ష, అన్న శ్రీనివాస్, చెల్లెళ్లు నవ్య, మానస ఉన్నారు. రూ.5 లక్షల అప్పు ఉండడంతోపాటు పెళ్లి కాలేదని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తంగళ్లపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తిరగబడతాం.. తరిమికొడతాం

- కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లపై తిరగబడి, తరిమికొడతామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గిస్తామని, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, రైతురుణమాఫీ చేస్తామన్నారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,500 మద్దతు ధర ఇస్తామన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు రూ.6లక్షలు మంజూరు చేస్తామని ప్రచారం చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, రాజు, రంజిత్, నవీన్, చంద్రమౌళి, రమేశ్, కొండయ్య, రాజనర్సు, తలారీ నర్సింలు, నరేశ్, దుబ్బాక రాజు, భాను, బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం





కొండగట్టు(చొప్పదండి): శ్రావణంలో చివరి మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. తొలుత కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించుకున్నారు. అయితే, వాహనాలను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలం కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాగా, సుమారుగా 30 వేల మంది భక్తులు రాగా, ఆలయానికి సుమారు రూ.12లక్షలకుపైగానే ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ సునీల్, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.